క్లుప్తంగా

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

జగద్గిరిగుట్ట: శ్రీ వైష్ణవి దుర్గా శ్రీచక్ర ఉపదేవతల సహిత ప్రాణప్రతిష్ఠాపన మగ్దూంనగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు శ్రీజయగురు నవదుర్గా సేవా సమితి అన్ని ఏర్పాట్లు చేసింది. అదేరోజు సాయంత్రం పల్లకీసేవ ఉంటుందన్నారు. ఈ పూజలు ఉడిపి కొక్కే సుబ్రమణ్యమఠాదీశులైన శ్రీవిద్యాప్రసన్న తీర్థస్వాముల వారిచే నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: హెచ్‌ఎండీఏ ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ శ్రీహోమ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు మల్లంపేట్ ప్రధాన రోడ్డు, క్రాంతినగర్, ఆర్టీసీ కాలనీ, శ్రీహోమ్స్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, రీకండరింగ్ పనుల నేపథ్యంలో శుక్రవారం సరఫరాలో ఆటంకం కలుగనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు బ్లూమ్ ఆస్పత్రి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, సత్యం ఎన్‌క్లేవ్, సురక్ష ఆస్పత్రి, ఎన్‌సీఎల్ సింధూ, దండమూడి ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సమస్యలను ఐకమత్యంతో పరిష్కరించుకోవాలి



అంజయ్యనగర్ నూతన కమిటీ సభ్యులతో కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: బస్తీలలో ఏ సమస్యలను ఐకమత్యంతో పరిష్కరించుకోవాలని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులు గురువారం కార్పొరేటర్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బస్తీ సమస్యలు అందరు కలిసికట్టుగా ఉండి పరిష్కరించుకొని ముందుకు సాగాలని తెలిపారు. ప్రెసిడెంట్‌గా నేతి శంకర్ గుప్తా, జనరల్ సుక్రటరీగా గణేష్, క్యాషియర్‌గా ఎస్ఎల్ ప్రసాద్, చీఫ్ అడ్వైజర్‌గా పళ్ల వెంకట్‌రెడ్డి, చైర్మన్‌గా భిక్షపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని కార్పొరేటర్ జగన్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అరుణ్, కృష్ణ, నరేందర్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



కొంపల్లి 6వ వార్డులో పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని 6వ వార్డులోని దుర్గమ్మ గుడి నుంచి పోచమ్మ ఆలయం వరకు రూ.21 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన కమిషనర్ శ్రీహరి, వైఎస్ చైర్మన్ గంగయ్యనాయక్, కౌన్సిలర్ వసంతలతో కలిసి ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రాధాన్యక్రమంలో పనులు చేపడుతున్నామని శ్రీశైలంయాదవ్ పేర్కొన్నారు.

ఆస్పత్రి వద్ద తాగొద్దన్నందుకు తాగుబోతుల హంగామా

- సెక్యూరిటీ గార్డు, డ్యూటీ నర్సుకు గాయాలు

కూకట్‌పల్లి: ఆస్పత్రి సమీపంలో మద్యం తాగొద్దు అన్నందుకు తాగుబోతులు ఆస్పత్రిపై దాడికి దిగారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నం.2లోని ఎస్ఎస్ఆర్ ఆస్పత్రి వద్ద ఉన్న ఖాళీ స్థలం వద్ద మందుబాబులు నిత్యం మద్యం సేవిస్తుంటారు. గత రాత్రి కొంతమంది యువకుల మధ్య సేవిస్తుండగా ఆస్పత్రి వద్ద డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ గార్డ్, నర్సు వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాల్సిందిగా కోరారు. దీంతో కోపోద్రిక్తులైన యువకులు బీర్‌బాటిళ్లు, రాళ్లతో ఆస్పత్రి అద్దాలు ధ్వంసం చేసి అక్కడే ఉన్న సెక్యూరిటీ, గార్డు, నర్సుపై దాడి చేశారు. ఈ ఘటనలో వారికి తల, చేతులపై గాయాలయ్యాయి. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కూల్చివేతలకు బ్రేక్.!

గాజులరామారం కబ్జాలపై నీలినీడలు

కుత్బుల్లాపూర్: గాజులరామారం ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు ఈనెల 16వ తేదీన కూల్చివేతలు చేపట్టి మరో రెండు మూడు రోజులు ఈ కూల్చివేతలు కొనసాగుతాయని ప్రకటించిన అది కార్యరూపం దాల్చలేదు. ఈనెల 16వ తేదీన భారీ పోలీసు బందోబస్తు మధ్య సుమారు 350 నుంచి 400 గదులను ఆర్డీవో మల్లయ్య, తహసీల్దార్ సంజీవరావు నేతృత్వంలో కూల్చివేతలు చేపట్టారు.

◆ **కబ్జాదారులతో అధికారుల ఒప్పందం.!**

అదేరోజు సాయంత్రం పటాన్ చెరువు సమీపంలో ఓ బార్‌లో కబ్జాదారులతో కూల్చివేతల్లో పాల్గొన్న అధికారి ఒప్పందం చేసుకోవడంతో రెండోరోజు కొనసాగాల్సిన కూల్చివేతలు నిలిచిపోయాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.రెవెన్యూ అధికారులు గుర్తించిన 21మంది కబ్జాదారులు రహస్య సమావేశం ఏర్పాటు చేసుకొని సంబంధిత రెవెన్యూ అధికారులకు పెద్ద మొత్తంలో డీల్ కుదుర్చుకొని కూల్చివేతలు ఆపినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

◆ **పది రోజులైనా పత్తాలేని అధికారులు**

సుమారు పది రోజులు గడిచిన అధికారుల లెక్కల ప్రకారం మరో 2100 అక్రమ నిర్మాణాలను కూల్చివేయాల్సి ఉంది. అయితే ఈ కూల్చివేతల విషయంపై నీలి నీడలు కమ్ముకోవడంతో ఇప్పటికే కబ్జాదారుల చేతుల్లో మోసపోయిన బాధితులు వారి ఇళ్ల చుట్టూ ప్రతిరోజు తిరుగుతూ కనిపిస్తున్నారు. పేదల సొమ్ముతో రాజభోగం అనుభవిస్తున్న కబ్జాదారులపై పోలీసులు 'పిడి'కిలి బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

◆ **కూల్చిన గదుల విలువ రూ.30కోట్లు..**

అధికారులు కూల్చివేసిన గదుల విలువ సుమారు రూ.30 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. మోసపోయిన బాధితులకు అండగా నిలబడి కబ్జాదారుల ఆస్తులను వేలం వేసి వారికి డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. విచ్చలవిడిగా కబ్జాలకు పాల్పడిన వారికి ఆర్డీవో మల్లయ్య, తహసీల్దార్ సంజీవరావు పూర్తి సహకారం అందించడం మూలంగానే ఇక్కడ యథేచ్ఛగా గత మూడేళ్లుగా కబ్జాల పర్వం కొనసాగిందని ప్రధాన ఆరోపణ.

◆ **కలెక్టర్ విచారణలో ఇలా వెలుగులోకి..**

కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం సర్వే నం. 307, 342, 329 ప్రభుత్వ స్థలాల్లో, హెచ్‌ఎండీఏ, ఎస్‌ఎఫ్‌సీ స్థలాలను కలుపుకుని ఏకంగా 2500 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ రహస్య నివేదిక ద్వారా బహిర్గతం చేసి రెవెన్యూ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న పరమేశ్వర్‌రెడ్డిపై సస్పెండ్ చేయడం.. ఇక్కడ 60 గజాలు 80 గజాలు చొప్పున ఉన్న ఒక్కో ప్లాటు లక్షన్నర నుంచి 3లక్షల వరకు డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించిన కలెక్టర్ కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చారు.

◆ **ఈనెల 17న వీఆర్‌ఏల సస్పెండ్.**

ఈ నేపథ్యంలో థాయిలాండ్‌లో అక్కడికి పోలీసులకు చిక్కిన తాత్కాలిక వీఆర్‌ఏ వాసుతో పాటు కూల్చివేతల సమయంలో కబ్జాదారుల నుంచి గూగుల్ పే,ఫోన్ పేల ద్వారా పదివేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేసిన రజనీకాంత్, నాగరాజులను ఈనెల 17న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కబ్జాల తతంగంలో మొత్తం నలుగురు అధికారులు ఇప్పటికే సస్పెండ్ అయ్యారు.

◆ **తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసులు..**

తాజాగా తహసీల్దార్ సంజీవరావుకు షోకాజ్ నోటీస్ అందజేయడంతో వివరణ తర్వాత కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకుంటారు అన్న విషయంపై ఇప్పుడు అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. సదరు అధికారి లాంగ్ లీవ్‌లో వెళ్లే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది. ఈ కబ్జాలో అధికారులకు సుమారు రూ.75 కోట్లు, కబ్జాదారులకు రూ.375 కోట్లు చేతులు మారినట్లు అధికారులు అందజేసిన నివేదిక ద్వారా తేటతెల్లమవుతోంది. దీనిపై భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ)తో పాటు రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, చీఫ్ సెక్రటరీ పూర్తిస్థాయి విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

సాక్షి కథనంతో రంగంలోకి ఉన్నతాధికారులు

ఇదే విషయాన్ని ఈనెల 13వ తేదీన 'జస్ట్ మూడేళ్లు.. ప్రభుత్వ భూములు వేలాదిగా అక్రమ నిర్మాణాలు' అనే శీర్షికతో సాక్షిలో ఓ కథనం ప్రచురితమయ్యింది. దీంతో ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ – అర్బన్ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ పూర్తిగా నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసి నివేదిక అందజేయాలని కలెక్టర్‌ను కోరారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



నిజాంపేట్‌లో ఏఐటీయూసీ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసురత్నం

నిజాంపేట్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ మున్సిపల్ అధ్యక్షుడు ఏసురత్నం, ఉపాధ్యక్షుడు రవిచంద్రన్ అన్నారు. ఈనెల 6, 7వ తేదీల్లో నిర్వహించతలపెట్టిన ఏఐటీయూసీ రాష్ట్ర 3వ మహాసభ పోస్టర్‌ను గురువారం నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు పెంచాలన్నారు. కొత్తగా గ్రామ పంచాయతీల నుంచి అప్‌గ్రేడైన మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయిలో పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదని గుర్తు చేశారు.

◆ మున్సిపల్ కార్మికులకు 10వ పీఆర్సీ వేతన సవరణ అమలు చేయకుంటే మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసనలు, ధర్నాలు చేపడతామని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ మహాసభలకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జయచంద్ర, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, నిజాంపేట్ అధ్యక్షుడు యాదయ్య, నాయకులు శ్రీనివాస్, భాగ్యమ్మ, నర్సమ్మ, యాదమ్మ, లక్ష్మి, నాగమణి, పద్మ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



ఐశ్వర్య (ఫైల్)

జీడిమెట్ల: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్ చెఱుకుపల్లి కాలనీకి చెందిన రాజేష్, ఐశ్వర్య(24) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఈనెల 20వ తేదీ ఉదయం 5గంటలకు రాజేష్ లేచి చూసేసరికి ఐశ్వర్య ఇంట్లో కనిపించలేదు. భర్త రాజేష్ ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహ్వానం



నిజాంపేట్: క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌కు చెందిన వీర్ భగత్ సేవక్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో సభ్యులు గురువారం మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి, వెంగయ్య చౌదరి తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి



జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మల్లారెడ్డి, పత్తి రఘుపతి

చింతల్: షాపూర్‌నగర్ నుంచి హెచ్‌ఎంటీ పైపులైన్ రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు పత్తి రఘుపతి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి గురువారం జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆల్విన్‌కాలనీ, జగద్గిరిగుట్టల మీదుగా షాపూర్‌నగర్, గాజులరామారం ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనదారులు హెచ్‌ఎంటీ పైపులైన్ రోడ్డును ఆశ్రయిస్తారన్నారు. దీంతో నిత్యం ఈ ప్రాంతం ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటోందన్నారు. ఈ రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు సిబ్బందిని నియమించి వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగకుండా చూడాలని కోరగా ట్రాఫిక్ సీఐ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు నందనం దివాకర్, చండీ శ్రీనివాస్, దుర్యోధనరావు, రాజేష్ మిశ్రా, సంతోష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో అదృశ్యం.. కొంపల్లిలో ప్రత్యక్షం



షన్నును కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కుత్బుల్లాపూర్: అదృశ్యమైన యువతిని పేట్‌బషీరాబాద్ పోలీసులు సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన షన్ను (16)మూడు రోజుల క్రితం అదృశ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన కల్వకుర్తి పోలీసులు మిగతా పోలీస్‌స్టేషన్లకు యువతి ఫోటోను పంపారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న సదరు యువతిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గుర్తించి యువతి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గురువారం యువతి షన్నును ఆమె సోదరి హసీనాకు అప్పగించారు. కాగా కల్వకుర్తిలో అదృశ్యమైన యువతి కొంపల్లికి ఎలా వచ్చిందన్న విషయాలు తెలియరాలేదు.

పెంచిన ఇళ్ల ట్యాక్స్‌ను తగ్గించాలి

నిజాంపేట్: ఇళ్ల ట్యాక్స్‌లు రెండింతలు పెంచడంతో గృహ యజమానులకు పెనుభారంగా మారిందని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఏ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లేని విధంగా నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు ఇళ్ల ట్యాక్స్‌లను రెండింతలు పెంచేశారన్నారు. 2019 సంవత్సరానికి నిర్మించిన అపార్ట్‌మెంట్లు, ఇళ్ల ట్యాక్స్‌లను తగ్గించే విధంగా సీడీఎంఏ అధికారులతో మాట్లాడాలని కోరారు. సీడీఎంఏ, రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ తీర్మానం లేకుండా నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు, కౌన్సిల్ పన్నులు పెంచే విషయంలో ఏకపక్షంగా వ్యవహరించారని విమర్శించారు. కార్పొరేషన్ పరిధిలో 12 శాతం అధిక ట్యాక్స్‌తో జీహెచ్‌ఎంసీ పరిధిలో కన్నా ప్రజలపై అధిక పన్ను భారం పడుతోందన్నారు. పన్నుల తగ్గింపు విషయంలో సరైన చర్యలు తీసుకోని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించుకుని ఉద్యమిస్తామని సతీష్ హెచ్చరించారు.

ఎప్పుడు ఎన్నికలొచ్చినా కాంగ్రెస్ విజయం తథ్యం



కరపత్రాలను పంచుతున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ నిరంకుశ పాలనతో ప్రజలు విసిగిపోయారని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని ఎంఎఫ్ ఫంక్షన్, ఎన్టీఆర్‌నగర్, చంద్రగిరినగర్‌లలో గురువారం ఆయన హాథ్ సే హాథ్ జోడో యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ.. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అధికారంలోకి వస్తే చేయబోయే పనులను ప్రజలకు వివరిస్తూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలతో మరోమారు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయనుందన్నారు. ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్ పద్మశాలి, రషీద్, బోయిని వెంకటేష్, మాజీ వార్డ్ మెంబెర్ గణేష్, జేమ్స్ తదితరులు ఉన్నారు.

దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బాలపీరు

నిజాంపేట్: అధికార పార్టీకి చెందిన దళిత ఎమ్మెల్యే సాటి దళితులను కించపరిచే విధంగా మాట్లాడటం సిగ్గు చేటని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి బాలపీరు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ దళితబంధు ఎమ్మార్పీఎస్ కొడుకులకు ఇచ్చామని వ్యాఖ్యానించారని అన్నారు. దళితబంధు అవినీతిపై ప్రశ్నించిన దళిత న్యాయవాది యుగేందర్‌పై ఎమ్మెల్యే అనుచరులతో దాడి చేయించడాన్ని ఖండించారు. దళిత బంధులో అవినీతి జరిగిదని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రే తెలిపారని అన్నారు. రాజకీయలకు అతీతంగా అర్హులైన దళితులందరికీ ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే కిశోర్ అనుచరుల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న న్యాయవాదికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని బాలపీరు డిమాండ్ చేశారు

మహిళలకు రుణాలు ఇచ్చేందుకు సహకరిస్తాం

ఎంఎస్ఎంఈ ప్రతినిధులు



పట్టణ సమైక్య గ్రూపులతో సమావేశమైన ఎంఎస్ఎంఈ ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: మహిళలకు రుణాలు అందించే విషయంలో తాము సహకారం అందిస్తామని ఎంఎస్ఎంఈ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ పట్టణ సమైక్య ఆధ్వర్యంలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యాపారాలు, కంపెనీలు, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ విషయంలో ఉత్సాహంగా ఉన్న వారికి తోడ్పాటు అందించే విధంగా రుణాలు అందజేస్తామని స్పష్టం చేశారు. అధ్యక్షురాలు పద్మ, కోశాధికారి రమ్యకుమారి తదితరులు పొదుపు, అప్పులు, వడ్డీలు ఇవ్వాల్సిన వారి నుంచి డబ్బులు వసూలు చేశారు. ప్రతినెలా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించిన వారికి క్రమ పద్ధతిలో వారికి తిరిగి రుణాలు అందించే విషయంలో తోడ్పాటు ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఎస్ఎల్‌జీ ఆస్పత్రి వైద్యుల మరో ఘనత

నిజాంపేట్: గుండె రెండు వాల్వుల మార్పిడి శస్త్ర చికిత్స జరిగిన రోగికి బాచుపల్లి ఎస్ఎల్‌జీ ఆస్పత్రి వైద్యులు క్లిష్టతరమైన చికిత్స ద్వారా రెండు వాల్వులను మార్చి మరో ఘనత సాధించారు. వరంగల్‌కు చెందిన మంజుల (42) పది సంవత్సరాల క్రితం మెట్రల్ వాల్వ్, అయోటిక్ వాల్వ్ రెండింటిని మార్చారు. అప్పట్లో ఆమెకు జంతువుల గుండెలో నుంచి తీసిన బయోప్రోస్టటిక్ వాల్వులు అమర్చారు. అయితే రెండు వాల్వులు పాడవడంతో ఆమె బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ వైద్యులను ఆశ్రయించింది. ఆస్పత్రి కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ జి.సుధీర్ నేతృత్వంలో 10గంటల పాటు క్లిష్టతరమైన శస్త్రచికిత్స చేసి సురక్షితంగా మెకానికల్ వాల్వ్‌లను అమర్చారు. ప్రస్తుతం రోగి వైద్యుల పర్యవేక్షణలో ఉందని తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ సుధీర్, కార్డియాక్ అనెస్థటిస్టు డాక్టర్ మానస, కార్డియాలజిస్టు డాక్టర్ భాను, ఇంటెన్సివిస్టు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ వైఎస్సార్‌టీపీ కోఆర్డినేటర్‌గా సురేష్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: వైఎస్సార్‌టీపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా దేశిరెడ్డి సురేష్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం లోటస్‌పాండ్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ అధినేత్రి నియోజకవర్గాల కో.ఆర్డినేటర్లు, అధ్యక్షులను నియమిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఉప్పరి ప్రసాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడిగా విజయరాజులను నియమించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. మొదటి నుంచి కుత్బుల్లాపూర్ ప్రాంతం వైఎస్సార్ అభిమానులకు కంచుకోట అని అన్నారు. పార్టీ ఆశయాలను ప్రజలకు వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేస్తామన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్



పంచశీల కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం రంగారెడ్డి డివిజన్ పరిధిలోని పంచశీల కాలనీలో రూ.55 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ విజయశేఖర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బస్తీ, కాలనీలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. పురపాలక మంత్రి కేటీఆర్ సహకారంతో నిధుల కొరత లేకుండా పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటున్నామని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ గోపాల్‌రెడ్డి, నాగేందర్, సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

◆ 'ప్రగతి యాత్ర'లో భాగంగా గాజులరామారం డివిజన్ వీనస్ రాక్ హైట్స్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికంగా రోడ్లు, డ్రైనేజీ వసతులు కల్పించాలని కాలనీవాసులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. డీఈఈ రూపాదేవి, ఏఈ కళ్యాణ్, డీజీఎం అప్పల నాయుడు, తదితరులు ఉన్నారు.

◆ దేవేందర్‌నగర్‌లో రూ.1.98 కోట్లతో నూతనంగా చేపడుతున్న హిందూ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. శ్మశానవాటికల అభివృద్ధి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరావు, కిషన్‌రావు, కస్తూరి బాల్‌రాజ్, పరుష శ్రీనివాస్‌యాదవ్‌లు ఉన్నారు.

ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం.

కుత్బుల్లాపూర్ గ్రామంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోయిన ఏడు బాధిత కుటుంబాలకు నష్టపరిహారాన్ని మంజూరు చేయించి చింతల్‌లోని కార్యాలయంలో రూ.53,40,316 విలువ చేసే చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ ప్రభావతి, టీపీఎస్ వికాస్, న్యాక్ ఇంజనీర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.